క్లుప్తంగా

బహుముఖ ప్రజ్ఞాశాలి సురవరం ప్రతాప్‌రెడ్డి

రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి



నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: సురవరం ప్రతాప్‌రెడ్డి బహుముఖ ప్రజ్ఞాశాలి అని షాద్‌నగర్ రెడ్డి సేవా సమితి అధ్యక్షుడు మదన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని రెడ్డి సేవా సమితి భవనంలో సురవరం ప్రతాప్‌రెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. స్వాతంత్ర్యోద్యమ సమయంలో సురవరం ప్రతాప్‌రెడ్డి తన కలంతో సమాజాన్ని మేల్కొలిపి బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా పోరాటం చేశారన్నారు. ఎమ్మెల్యేగా గెలుపొంది ప్రజలకు ఎన్నో సేవలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో రెడ్డి సేవా సమితి నాయకులు రవీందర్‌రెడ్డి, నర్సింహ్మారెడ్డి, రఘుపతిరెడ్డి, దామోదర్‌రెడ్డి, చెంది మహేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బస్సు సౌకర్యంపై గ్రామస్తుల హర్షం



బస్సుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

కేశంపేట: మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి ఐఎస్ సదన్ నుంచి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. గ్రామం నుంచి కడ్తాల్, రావిచేడ్, మక్తామాదరం గ్రామాల నుంచి హైదరాబాద్ వెళ్లేందుకు ఈ బస్సు సౌకర్యవంతంగా ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించిన మహేశ్వరం డిపో మెనేజర్ మోహన్‌రెడ్డి, సీఐ అంజమ్మలకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామానికి నూతనంగా వచ్చిన ఆర్టీసీ బస్సుకు గ్రామస్తులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో మల్లయ్య, శ్రీను, జీవనమూర్తి, అశోక్, సాయి తదితరులు పాల్గొన్నారు.


వెంకట్‌గోపాల్‌కు డాక్టరేట్

మొయినాబాద్‌రూరల్: యూనివర్సిటీలలో నిర్వహించే పరిశోధనలు ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ కిష్టఫర్ అన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్ రెవెన్యూ పరిధిలో గల చైతన్య డీమ్డ్ టుబీ యూనివర్సిటీలో వెంకటగోపాల్‌శాస్త్రీకి డాక్టరేట్ లభించింది. వెంకటగోపాల్‌శాస్త్రీ వాణిజ్యం, వ్యాపార నివారణ విభాగంలో ఫిజికల్ అండ్ ఫైనాన్షియల్ ఫర్ఫామెన్స్ ఆఫ్ ఎస్‌బీఐ ఏ సెలక్ట్ స్టడీ అనే అంశంపై డాక్టర్ వెంకట జనార్ధన్‌రావు పర్యవేక్షణలో వెంకటగోపాల్‌శాస్త్రీ పరిశోధన చేశారు. ఈ సందర్భంగా ఆయనకు డాక్టరేట్ లభించగా మంగళవారం వైస్ ఛాన్సలర్ కిష్టఫర్ అభినందించి డాక్టరేట్ పట్టాను అందజేశారు. కార్యక్రమంలో చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ సాత్వికరెడ్డి, రిజిస్ట్రార్ రవీందర్, జగదీశ్వర్, ప్రతాప్, రాజేందర్, రాజు, పబ్లిక్ రిలేషన్ అధి కారి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కళాకారుడికి సన్మానం

షాద్‌నగర్‌రూరల్: స్వర్ణనంది అవార్డును అందుకున్న పట్టణానికి చెందిన అజయ్ నటరాజ కళానిలయం వ్యవస్థాపకుడు మానపాటి ప్రదీప్‌కుమార్‌ను మంగళవారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఘనంగా సన్మానించారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారికి మెగా ఎంటర్‌ప్రైజెస్ వారి ఆధ్వర్యంలో సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని బిర్లా భాస్కర్ ఆడిటోరియంలో అవార్డులను అందజేశారు. కళారంగంలో సేవలు అందిస్తున్న మానపాటి ప్రదీప్‌కుమార్ స్వర్ణనంది పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా చైర్‌పర్సన్ తాండ్ర విశాల, సీరియల్ నటుడు ప్రణయ్, మధుబాబుల చేతుల మీదుగా మానపాటి ప్రదీప్‌కుమార్ అవార్డును అందుకున్నారు. అవార్డు అందుకున్న ఆయనను నాయకులు, ప్రజాప్రతినిధులు సన్మానించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



దాతను సన్మానిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల: మండలంలోని తంగడపల్లి గ్రామంలో నిర్మిస్తున్న హనుమాన్ దేవాలయానికి హైదరాబాద్‌కు చెందిన సాయి రూ.4లక్షల విరాళం అందించారు. ఈ సందర్భంగా మంగళవారం తంగడపల్లిలో గ్రామస్తులు దాత కుటుంబ సభ్యులను ఆలయం వద్ద ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు సత్తయ్యగౌడ్, రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ బళ్లు.. సౌకర్యాల పొదరిళ్లు

ప్రచార ఆర్భాటాలకు మోసపోవద్దు | విశాలమైన తరగతి గదులు, ఆటస్థలాలు | క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు, నాణ్యమైన విద్య | పాఠశాలల్లో అన్నీ ఉచితమే



పాపిరెడ్డిగూడ జెడ్పీ ఉన్నత పాఠశాల



పాపిరెడ్డిగూడ ప్రాథమిక పాఠశాలలో ఆట వస్తువులు

కేశంపేట: ప్రభుత్వ పాఠశాలలు 'మన ఊరు–మన బడి' పథకంలో మౌలిక వసతులు కల్పించడంతో మెరుగుపడ్డాయి. గతంలో ప్రభుత్వ పాఠశాలలు అంటే శిథిలావస్థకు చేరుకున్న భవనాలు, సరైన బోధన లేకపోవడం, గదులు సరిగా ఉండవనే భావన ఉండేది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల కంటే ప్రైవేట్ వైపు మొగ్గు చూపేవారు. ప్రస్తుతం ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం, స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా ముందుకొచ్చి తరగతి గదులు, మౌలిక వసతులను కల్పిస్తున్నారు. నేడు ప్రభుత్వ బడులు కార్పొరేట్ బడులను దీటుగా పచ్చని ఆహ్లాదకర వాతావరణాన్ని సంతరించుకున్నాయి. దీంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన విద్యను బోధించేందుకు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు ఉండడంతో చాలా మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రభుత్వ బడులవైపు మొగ్గు చూపుతున్నారు.

ప్రభుత్వ బడుల వైపు మొగ్గు

ఈ విద్యా సంవత్సరం జూన్ 12 నుంచి ప్రారంభం కానున్నాయి. దీంతో ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు తమ ప్రచారాలను ప్రారంభించాయి. పిల్లల తల్లిదండ్రులను మచ్చిక చేసుకోవడానికి సకల హంగులతో ప్రచారాలను హోరెత్తిస్తున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లలను ఏ పాఠశాలలో చేర్పించాలో తేల్చుకోలేకపోతున్నారు. పాఠశాలలో ఆహ్లాదకరమైన వాతావరణం, ఆటపాటలకు విశాలమైన మైదానాలు, తరగతి గదులు, ఉత్తమ విద్యాబోధన ఉన్న పాఠశాలల్లో పిల్లలను చేర్పిస్తే ఉత్తమ విద్యార్థిగా మారుతాడు. విద్యార్థులు రోజుకు 8గంటలు పాఠశాలలోనే గడుపుతారు. పరిసరాల ప్రభావం విద్యార్థులపై ఉంటుంది. స్వచ్ఛమైన వాతావరణం, ఆహ్లాదపరిచే పరిసరాలు, వసతి సౌకర్యాలు ఉంటే విద్యార్థి విజేతగా నిలుస్తాడు. ఇందుకోసం విద్యార్థుల తల్లిదండ్రులు ప్రచార్భాటాలకు మోసపోకుండా పాఠశాలలను సందర్శించి పిల్లలను చేర్పించాలి. నాణ్యమైన విద్య అందిస్తారు.

బోధన, ఆటలకు క్వాలిఫైడ్ ఉపాధ్యాయులు

విద్యార్థి మనస్సు పెంపొందించేందుకు చదువుతోపాటు ఆటలు ఎంతో ముఖ్యం. దీంతో విద్యార్థికి శారీరక దారుఢ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రస్తుతం వీటి విషయంలో చాలా ప్రైవేట్ పాఠశాలలు ప్రమాణాలకు తీలోదకాలు ఇస్తున్నాయి. విద్యార్థులకు ఆటలపై ఆసక్తి ఉన్నా సౌకర్యాలు లేక రాణించలేకపోతున్నారు. ప్రభుత్వ బడుల్లో విశాలమైన మైదానాలు ఉండి, ప్రతి రోజు ఆటలు ఆడించేందుకు ఉపాధ్యాయుడు అందుబాటులో ఉంటాడు. పరిసరాలు, సౌకర్యాలతో పాటు బోధన విషయంలో నాణ్యత ఉండాలి.

డిజిటల్ తరగతులు..

ప్రభుత్వ బడుల్లో 'మన ఊరు–మన బడి' పథకంలో ఎంపికైన బడుల్లో ప్రతి తరగతిలో డిజిటల్ తరగతులను బోధించేందుకు డిజిటల్ తెరలను అందించాయి. మరికొన్ని పాఠశాలల్లో దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి డిజిటల్ తెరలను అందించాయి. తరగతి గదుల్లో డిజిటల్ తెరలతో పాటు గ్రీన్ బోర్డులను ఏర్పాటుచేసి విద్యార్థులకు బోధన చేస్తున్నారు. అదేవిధంగా ప్రైవేట్ పాఠశాలతో పోటీ పడి పదో తరగతిలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధిస్తున్నారు.

అన్నీ ఉచితాలే..

ప్రభుత్వ బడుల్లో చేరితే విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు యూనిఫాంలను ప్రభుత్వం అందిస్తోంది. అదేవిధంగా ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం రుచికరమైన భోజనం అందించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరేందుకు కృషి చేస్తోంది.

మోసపోకండి..

విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల ఆర్భాటాలకు మోసపోవద్దు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. అదేవిధంగా అల్పాహారం, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనాన్ని అందిస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందిస్తారు. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ బడులను నిర్వహిస్తోంది.

– అస్కాని శ్రీనివాససాగర్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు, కేశంపేట

సర్కార్ బడుల్లో చేర్పించాలి



తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి. సర్కార్ బడుల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు ఉంటారు. నాణ్యమైన విద్యను నేర్పుతారు. ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ బడుల్లో విద్యను అందిస్తున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని వసతులు ఉంటాయి.

–మఠం చంద్రశేఖర్, గెజిటెడ్ హెచ్‌ఎం, కొత్తపేట జెడ్పీ పాఠశాల, కేశంపేట

ఆధార్ కేంద్రాలు లేక అవస్థలు

- గంటల తరబడి ప్రజలకు తప్పని నిరీక్షణ
- పట్టించుకునే నాథుడు కరువు



చేవెళ్లలో పోస్ట్ ఆఫీస్ వద్ద ఆధార్ అప్‌డేట్ కోసం క్యూలైన్‌లో నిలబడిన ప్రజలు

చేవెళ్ల: ప్రతీ ఒక్కరికి ఇప్పుడు ఆధార్ కార్డు లేనిది ఏ పని జరగడం లేదు. ఈ కార్డు విలువ అంతగా పెరిగింది కానీ ఈ ఆధార్ కేంద్రాలు మాత్రం పెరగటం లేదు. ఉన్నవి తొలగించి నియోజకవర్గంలో ఒకటి, రెండు చోట్ల ఏర్పాటు చేయటంతో అందుబాటులో సరైనా కేంద్రాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారు. మండల కేంద్రంలో పోస్టాఫీస్ వద్ద ఉన్న ఒకే ఒక్క ఆధార్ కేంద్రం వద్ద మంగళవారం ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి క్యూలైన్‌లో నిలబడ్డారు. నియోజకవర్గానికి ఈ కేంద్రం ఒక్కటే ఆధారం. ఇక్కడ ప్రతీ రోజు ఆధార్‌కార్డుల కోసం వచ్చే జనం ఉదయం నుంచి సాయంత్రం వరకు క్యూలైన్‌లో వేచి ఉండాల్సి వస్తోంది. ఇక్కడ ఒక వ్యక్తి ఒక కంప్యూటర్‌తో రోజుకు 20–30కి మించిన కార్డులకు చేయటానికి రాదు. వృద్ధులు, చిన్నపిల్లలు అందరూ ఉదయం నుంచి సాయంత్రం వరకు కేంద్రాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. ఈ కేంద్రానికి ఇతర మండలాలు, గ్రామాల నుంచి ఆధార్ కార్డులలో మార్పులు, చేర్పులు, ఫోన్ నెంబర్ లింక్ చేయటం, వేలిముద్రలు సరిపోకపోవటంతో మళ్లీ అప్‌డేట్ చేసుకునేందుకు, కొత్తగా పిల్లలకు ఆధార్ కార్డులు తీసుకునేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఉదయం వస్తే సాయంత్రం వరకు క్యూలైన్‌లోనే ఉంటున్నారు. ఇక్కడ పోస్టాఫీస్ కార్యక్రమాలకు వచ్చే జనం, ఆధార్‌కోసం వచ్చే జనంతో చాలీచాలని గదుల్లో ప్రజలు నిలబడేందుకు కూడా స్థలం ఉండటం లేదు. దీంతో రోడ్డుపైకి కనిపించేలా క్యూలైన్‌లోలో నిలబడుతున్నారు. గతంలో మీసేవ కేంద్రాల్లో నిరంతరం అందుబాటులో ఉండేవి. వాటి నుంచి తొలగించిన నాటి నుంచి ఆధార్ కేద్రాలకు ఇబ్బందులు తప్పటం లేదు. ప్రజల అవసరాల మేరకు ప్రభుత్వం ఆధార్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. మండల కేంద్రానికి ఒక ఆధార్ కేంద్రం ఏర్పాటు చేస్తేనే ప్రజలకు అందుబాటులో ఉంటుందని దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మొయినాబాద్: మండల పరిధిలోని బాకారంలో విద్యుత్ లైన్ల కింద ఉన్న చెట్లకొమ్మల తొలగింపు కారణంగా బుధవారం బాకారం ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని విద్యుత్ ఏఈ హమునాయక్ తెలిపారు. రైతులు, వినియోగదారులు విద్యుత్ అంతరాయానికి సహకరించాలని కోరారు.

బీజేపీ గెలుపు ఖాయం

నందిగామ: కేంద్రంలో ముచ్చటగా మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చి ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ ప్రమాణస్వీకారం చేయడం ఖాయమని బీజేపీ సీనియర్ నాయకుడు, నర్సప్పగూడ గొర్రెల పెంపకందారుల సహకార సంఘం అధ్యక్షుడు కాట్న సురేందర్ ధీమా వ్యక్తం చేశారు. మండల కేంద్రమైన నందిగామలో మంగళవారం వారు మాట్లాడుతూ.. ప్రధానిగా మోదీ బాధ్యతలు చేపట్టిన అనంతరం దేశం అనేక రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. మన రాష్ట్రంలో 17 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికలలో బీజేపీకి అత్యధిక సీట్లు వస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరు గ్యారంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీలేదని విమర్శించారు.

ప్రభుత్వ స్థలాన్ని కాపాడండి

ఎమ్మార్వోకు ఫిర్యాదు



ఎమ్మార్వోకు ఫిర్యాదు చేస్తున్న బాబునాయక్

శంకర్‌పల్లి: శంకర్‌పల్లి మండలం మోకిల తండాలో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతోందని బాబునాయక్ అనే యువకుడు మంగళవారం శంకర్‌పల్లి ఎమ్మార్వో సురేందర్‌కు ఫిర్యాదు చేశాడు. మోకిల తండాలోని సర్వే నం.76లో 29గుంటల ప్రభుత్వ భూమి ఉంది. దాంట్లో ప్రస్తుతం గ్రామ పంచాయతీ భవనం ఉండగా.. భవనం వెనకాల ఖాళీ స్థలం ఉంది. ఆ స్థలంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఇల్లు కట్టడంతో పాటు, బోర్ వేస్తున్నాడు. యువకులు గమనించి గ్రామ సెక్రటరీకి ఫిర్యాదు చేయగా పట్టించుకోలేదు. దీంతో డయల్ 100కి కాల్ చేయగా.. వారు వచ్చి బోర్‌వేల్ యంత్రాన్ని పంపించేశారు. అనంతరం బాబునాయక్ అక్రమ నిర్మాణం చేస్తున్న వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశాడు.

సకాలంలో దుస్తులు అందజేయాలి

డీఆర్‌డీఓ పీడీ శ్రీలత



దుస్తుల వివరాలు అడిగి తెలుసుకుంటున్న పీడీ శ్రీలత

షాద్‌నగర్: పాఠశాలలు ప్రారంభమయ్యే వరకు విద్యార్థులకు స్కూల్ యూనిఫాం అందజేయాలని డీఆర్‌డీఓ పీడీ శ్రీలత మహిళా సంఘాల సభ్యులకు సూచించారు. షాద్‌నగర్‌లో ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు, మొగిలిగిద్ద కస్తూర్బాలో చదువుతున్న పాఠశాల, కళాశాల విద్యార్థులకు ఏకరూప దుస్తులను కుట్టడానికి ప్రభుత్వం లింగారెడ్డిగూడ, రాయికల్, చించోడ్, కిషన్‌నగర్, బూర్గుల, కమ్మదనం, మహల్ ఎలికట్ట గ్రామాల స్వయం సహాయ సంఘాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాలను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుస్తులకు సంబంధించిన వివరాలను మహిళా సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంత మంది విద్యార్థులకు ఏకరూప దుస్తులు కుడుతున్నారు. ఎన్ని మీటర్ల బట్ట సరఫరా అయ్యింది అన్న విషయాలను ఆమె సంఘాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీడీ మాట్లాడుతూ.. మహిళా సంఘాల సభ్యులు విద్యార్థులకు సకాలంలో పాఠశాల యూనిఫాం అందజేయాలని సూచించారు. కొలతలకు అనుగుణంగా దుస్తులను కుట్టాలన్నారు. వచ్చే నెలలో పాఠశాలలు, కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మహిళా సంఘాల సభ్యులు సకాలంలో దుస్తులను కుట్టడం పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీయం నాగేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సేవలు చిరస్మరణీయం



షాద్‌నగర్: ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

షాద్‌నగర్: తెలుగు జాతి గౌరవాన్ని పెంచిన మహానేత ఎన్టీఆర్ అని, ఆయన ప్రజలకు చేసిన సేవలు చిరస్మరణీయమైనవని మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మాజీ ముఖ్యమంత్రి దివంగత నందమూరి తారక రామారావు 101వ జయంతిని షాద్‌నగర్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ చౌరస్తాలో టీడీపీ నేతలు ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటయ్యగౌడ్, ఆనంద్, భాస్కర్‌రెడ్డి, భూపతిరెడ్డి, అంజయ్య, యాదయ్యగౌడ్, కుమార్, కృష్ణయ్య, అనంతయ్య, యాదయ్య, శంకర్, శ్రీను, బాల్‌రాజ్, రామకృష్ణ పాల్గొన్నారు.

కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో

కమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో మున్సిపాలిటీ పరిధిలోని బీవీరావు నగర్‌లో ఎన్టీఆర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి రాష్ట్ర కార్యదర్శి పాతూరి వెంకట్‌రావు, సత్యనారాయణ, పినబాక ప్రభాకర్, వసంతరావు, మలినేని శ్రీను, మల్లేశ్వర్‌రావు, శ్రీనివాస్‌రావు, నాగేశ్వర్‌రావు, మోహన్‌రావు, సురేశ్, శ్రీనివాస్‌రావు, అప్పారావు, మస్తాన్‌రావు, కంకల్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల: విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు స్వర్గీయ నందమూరి తారకరామారావు సేవలు చిరస్మరణీయమైనవని టీడీపీ చేవెళ్ల పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కాసుల సుభాన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం టీడీపీ నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మల్లారెడ్డి, సుధాకర్‌గౌడ్, అంజయ్య యాదవ్, నరేందర్ ఉన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

మొయినాబాద్: ప్రభుత్వం 60శాతం సబ్సిడీపై అందజేసే పచ్చిరొట్ట పైర్లకు సంబంధించిన విత్తనాలు(జనుములు) అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారిణి రాగమ్మ తెలిపారు. మొయినాబాద్‌లోని పీఏసీఎస్(ప్రాథమిక వ్యవసాయ సహకార సొసైటీ)లో 90 క్వింటాళ్ల జనుములు అందుబాటులో ఉన్నాయని బుధవారం రైతులకు అందజేస్తామని తెలిపారు. 40 కిలోల బస్తాకు సబ్సిడీ పోను రూ.1448 రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. జనుములు కావాల్సిన రైతులు పట్టాదార్ పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలు తీసుకుని వచ్చి మొయినాబాద్, కేతిరెడ్డిపల్లి క్లస్టర్‌లలోని రైతువేదికల వద్ద వ్యవసాయాధికారుల నుంచి పర్మిట్‌లు తీసుకొని జనుములు తీసుకోవాలన్నారు. మండలంలోని చిలుకూరు, హిమాయత్‌నగర్, దేవల్‌వెంకటాపూర్, నాగిరెడ్డిగూడ, బాకారం, ఎనికేపల్లి, అమ్డాపూర్, నజీబ్‌నగర్, ముర్తూజగూడ, మేడిపల్లి, చిన్నమంగళారం, మోత్కుపల్లి, రెడ్డిపల్లి, చందానగర్, అజీజ్‌నగర్, బంగాలిగూడ గ్రామాల రైతులు మొయినాబాద్ క్లస్టర్ రైతువేదికలో, నక్కలపల్లి, ఎత్‌బార్‌పల్లి, తోలుకట్ట, చాకలిగూడ, కేతిరెడ్డిపల్లి, సజ్జన్‌ఫల్లి, కనకమామిడి, పెద్దమంగళారం, చిన్నషాపూర్, వెంకటాపూర్, శ్రీరాంనగర్, సురంగల్ గ్రామాల రైతులు కేతిరెడ్డిపల్లి క్లస్టర్ రైతువేదికలో పర్మిట్లు తీసుకోవాలన్నారు.

రసీదు తప్పనిసరిగా తీసుకోవాలి

జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి



మాట్లాడుతున్న గీతారెడ్డి

నందిగామ: రైతులు లైసెన్స్ కలిగిన ప్రభుత్వ డీలర్ల దగ్గర మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని జిల్లా వ్యవసాయాధికారిణి గీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని చేగూరులో ఏఓ గోపాల్ ఆధ్వర్యంలో మంగళవారం రైతు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. రైతులు విత్తనాలు కొనే ముందు తెలుసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని, ఆ రసీదును పంట దిగుబడి వచ్చేవరకు జాగ్రత్తగా పెట్టుకోవాలని తెలిపారు. విత్తన ప్యాకెట్ మీద తయారైన తేదీ, కాలం ముగిసిన తేదీని సరిచూసుకోవాలన్నారు. ఎవరైనా నకిలీ, లూస్ విత్తనాలు అమ్మినా విషయాలు తెలిసినట్లయితే వెంటనే వ్యవసాయ శాఖ అధికారులతో పాటు సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా మండల వ్యవసాయాధికారులను గానీ, వ్యవసాయ విస్తరణ అధికారులను గానీ సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు రవి, ఆర్ఐ శ్రీనివాస్ గౌడ్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

రేపే చివరి గడువు

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులకు ఇంటర్మీడియేట్‌లో ఉచిత కార్పొరేట్ విద్యకుగాను ఈనెల 30వ తేదీవరకు దరఖాస్తులు చేసుకునేందుకు అవకాశం ఉందని ఎంఈఓ సయ్యద్ అక్బర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి పూర్తి చేసిన కనీసం 7 జీపీఏ సాధించిన విద్యార్థులు ఇంటర్‌లో కార్పొరేట్ విద్యను ఉచితంగా పొందేందుకు దరఖాస్తులు చేసుకోవాలని చెప్పారు. విద్యార్థుల దరఖాస్తులను పరిశీలించి మెరిట్, రిజర్వేషన్ల ప్రకారం ఇంటర్మీడియేట్‌లో ఎంపిక చేసిన మూడు కళాశాలల్లో సీట్లు కేటాయిస్తారన్నారు. విద్యార్థులు మీసేవ కేంద్రాల ద్వారా ఆన్‌లైన్‌లో ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. జూన్ 3వ తేదీన ఎంపిక జాబితా ప్రకటిస్తారని, 6వ తేదీ నుంచి సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు కార్పొరేట్ కళాశాల వివరాలతో కూడిన సమాచారం ఇస్తారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ దివ్యాంగులు, మైనార్టీ, ఈబీసీ వర్గాలకు చెందిన వారై ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలైన జెడ్పీహెచ్‌ఎస్, ఎయిడెడ్, కేజీబీవీ, నవోదయ, గురుకులాలు, ఆదర్శ పాఠశాలలు, బెస్ట్ అవైలబుల్ స్కీమ్ కింద చదివిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. విద్యార్థి తల్లిదండ్రుల వార్షిక ఆదాయ పత్రం, కుల ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్‌లను జతచేయాలని, వీటితోపాటు బ్యాంక్ పాస్‌బుక్, రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివినట్లుగా కనీసం మూడేళ్ల బోనోఫైడ్‌లను దరఖాస్తుతో పాటు జతచేయాలని సూచించారు.

వరికొయ్యలను కాలిస్తే ముప్పే

- అవగాహనలేమితో కొయ్యలు, గడ్డి పొలంలోనే దహనం
- భూమిలోనే కలియదున్నితేనే లాభం
- పంట దిగుబడి పెరుగుతుందంటున్న వ్యవసాయ అధికారులు



మల్లారెడ్డిగూడలో తగులబెడుతున్న వరికొయ్యలు

షాబాద్: వ్యవసాయంలో ప్రస్తుతం కూలీల కొరత ఉండటంతో రైతులు యంత్రాలను ఆశ్రయిస్తున్నారు. వరి కోతలకు హార్వెస్టర్లను వినియోగిస్తుండటంతో గడ్డి వినియోగం తగ్గిపోయింది. పశుసంపద ఉన్న వారు గడ్డిని సేకరిస్తుండగా మిగతావారు అదే విధంగా పొలంలో వదిలేస్తున్నారు. తదుపరి పంటకు పొలాన్ని సిద్ధం చేసే క్రమంలో వరి కొయ్యలతో పాటు, గడ్డిని దహనం చేస్తున్నారు. అన్నదాతలు అవగాహన లోపంతో చేస్తున్న ఈ చర్యతో భూసారానికి ముప్పు పొంచి ఉందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

చైతన్య పరిచేందుకు చర్యలు

వానాకాలం, యాసంగి సీజన్‌లలో దాదాపు లక్షల ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. పంటను కోయించిన తర్వాత రైతులు వరి మొదళ్లు(కొయ్యలను) కాల్చుతున్నారు. దీంతో రైతులకు ఉపయోగం కంటే నష్టమే ఉంటుందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. వరికొయ్యలను కలియదున్నితే భూసారం పెరిగి ఆశించిన దిగుబడి వస్తుందంటున్నారు. ఇందుకోసం రైతులకు అవగాహన కల్పిస్తున్నట్లు వ్యవసాయ శాఖ పేర్కొంది. గతంలో పంటల అవశేషాలు (చెత్తాచెందారం, పత్తి కట్టె, వరికొయ్యలు) తగులబెట్టకుండా భూమిలోనే దున్నేవారు. ప్రస్తుతం వరికొయ్యలు కాల్చుతుండడంతో ఎన్ని ఎరువులు చల్లినా పంట దిగుబడి తగ్గుతోందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చైతన్య పరిచేందుకు వ్యవసాయశాఖ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

మోతాదుకు మంచి రసాయనాలు..

పంట దిగుబడికి వాతావరణం, నాణ్యమైన విత్తనాలే కారణమని చెబుతుంటారు. దిగుబడి కోసం భూమిలో మోతాదుకు మించి రసాయన ఎరువులు చల్లడంతో భూసారం తగ్గుతుంది. భూమిలో సేంద్రియ ఎరువులు చల్లడంతో భూసారం పెరుగుతుంది. భూమిలో సహజసిద్ధంగా ఉండే నత్రజని, భాస్వరం, పొటాష్ వంటి పోషకాలను సూక్ష్మజీవులు మొక్కకు అందిస్తూ పెరుగుదలకు సహకరిస్తాయి.

సేంద్రియ కర్బనం అంతంతే..

భూమిలో పశువులు, గొర్రెలు, కోళ్ల ఎరువును భూమిలో చల్లి కలియదున్నితే పచ్చిరొట్ట ఎరువులతో భూమిలో సేంద్రియ కర్బనం ఏర్పడుతుంది. రైతులు ఎక్కువ శాతం సేంద్రియ ఎరువులు చల్లడం లేదు. కలుపు మొక్కలు, పత్తి కట్టె, వరికొయ్య కాళ్లు భూమిలో కలియదున్నాలని వ్యవసాయ అధికారులు చెబుతున్నా రైతులు వారి సలహాలు పాటించడం లేదు. రోటవేటర్‌తో దున్నితే పంట అవశేషాలు భూమిలో కలిసిపోయి, పెద్దగా రసాయన ఎరువుల అవసరం లేకుండా పండించొచ్చు.

ఒకరిని చూసి మరొకరు..

ఒక రైతును చూసి మరో రైతు పంట అవశేషాలను కాలుస్తున్నారు. దీంతో భూమిలో ఉండే సూక్ష్మజీవులు చనిపోతున్నాయి. పొగతో వాతావరణం కలుషిత మవుతుండటంతో పాటు శ్వాసకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. కొన్నిసార్లు భూమిలోని అవశేషాలు తగలబెడుతున్న సమయంలో సమీప మామిడి చెట్లు, హరితహారం మొక్కలు, విద్యుత్ వైర్లు, మోటార్లు కాలిపోతున్నాయి.

కలియదున్నితే లాభం



భూమిలో పంట అవశేషాలను కలియదున్ని, ఎకరాకు మూడు బస్తాల సింగిల్ సూపర్ పాస్పెట్ చల్లితే భూమిలోనే ఎరువుగా ఉపయోగపడుతుంది. రసాయన ఎరువులకు పెట్టే ఖర్చు 50 శాతం తగ్గుతుంది. రైతులకు అవగాహన లేక వరి కొయ్యలను కాల్చుతుండటంతో నష్టం వాటిల్లుతోంది.

–వెంకటేశం, వ్యవసాయశాఖ అధికారి, షాబాద్